సాక్షి
ఖమ్మం
మంగళవారం । 19 । నవంబర్ । 2024



సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజావాణిలో సమస్యలపై అందే దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. 8లో



పత్తి రైతుల ఆందోళన

పత్తి ధరల ఖరారులో అన్యాయం జరుగుతోందని రైతులు సీసీఐ అధికారుల ఎదుట తమ గోడు వెళ్లబోసుకున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
30° / 15°

వాతావరణం

జిల్లాలో మంగళవారం చలి ప్రభావం పెరుగుతుంది. రాత్రివేళ గంటగంటకు చలిగాలుల తీవ్రత ఎక్కువవుతుంది.

న్యూస్‌రీల్

సొంతంగా యాంటీ బయోటిక్స్ వాడొద్దు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ కళావతిబాయి

ఖమ్మంవైద్యవిభాగం: సొంతంగా లేదా ఆర్‌ఎంపీ, పీఎంపీలు చెప్పారని యాంటీ బయోటిక్స్ వాడితే శరీర వ్యవస్థ దెబ్బతినే ప్రమాదముందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.కళావతిబాయి తెలిపారు. ఈ విషయమై అవగాహన వారోత్సవాలు సోమవారం ప్రారంభం కాగా, ఖమ్మం మామిళ్లగూడెం యూపీహెచ్‌సీలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. యాంటీ బయోటిక్స్ ఎక్కువగా వాడితే భవిష్యత్‌లో వ్యాధుల బారిన పడితే మందులు పనిచేయవని తెలిపారు. అర్హులైన వైద్యులు సూచిస్తే తప్ప ఈ మందుల జోలికి వెళ్లొద్దని సూచించారు. అలాగే, మందుల షాపుల యజమానులు కూడా నిపుణులైన వైద్యుల ప్రిస్క్రిప్షన్ ఆధారంగానే అమ్మాలని తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సైదులు, వైద్యాధికారి కృష్ణచైతన్యతో పాటు ఉద్యోగులు జి.సాంబశివరెడ్డి, టి.ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న న్యాయ సేవా సంస్థ కార్యదర్శి చంద్రశేఖరరావు

ఖమ్మం లీగల్: పారా లీగల్ వలంటీర్లు చట్టాలపై అవగాహన పెంచుకుని ప్రజలకు వివరించాలని జిల్లా న్యాయ సేవా సంస్థ సెక్రటరీ కె.చంద్రశేఖరరావు సూచించారు. ఖమ్మంలో వలంటీర్లకు సోమవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఉచిత న్యాయ సాయం, చట్టాల ద్వారా పేదలు, మహిళలు, దివ్యాంగులకు కలిగే లబ్ధిని క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. ఈవిషయమై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలని తెలిపారు. డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మల్లెబోయిన వలరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు బీసీ కమిషన్ ప్రజాభిప్రాయ సేకరణ

ఖమ్మం సహకారనగర్: బీసీ కమిషన్ ప్రతినిధుల బృందం ఖమ్మం కలెక్టరేట్‌లో మంగళవారం ఉదయం 10గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనుందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన రాజకీయ పార్టీలు, సంఘాల నాయకులు, ప్రజలు బీసీ వర్గాలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో అవసరమైన రిజర్వేషన్ల దామాషాపై అభిప్రాయాలు తెలియచేయొచ్చని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఆరు సెట్ల పత్రాలను వెరిఫికేషన్ అఫిడవిట్‌తో పాటు రూ.20 నాన్ జ్యూడీషియల్ స్టాంపు పేపర్‌పై తెలుగు లేదా ఆంగ్ల భాషల్లో ఇవ్వాల్సి ఇవ్వాలని సూచించారు.

ప్రశాంతంగా ముగిసిన గ్రూప్–3 పరీక్షలు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో గ్రూప్–3 పరీక్షలు రెండో రోజైన సోమవారంతో ముగిశాయి. ఆదివారం రెండు సెషన్లలో పరీక్ష నిర్వహించగా సోమవారం ఒకటే సెషన్‌లో పరీక్ష జరిగింది. జిల్లాలోని 87 కేంద్రాల్లో 27,984 అభ్యర్థులను కేటాయించగా నిర్ణీత సమయానికి కంటే ముందుగానే చేరుకున్నారు. పోలీస్ బందోబస్తు మధ్య నడుమ ఎలాంటి అవాంతరాలు జరగకుండా పరీక్షలు పూర్తికావడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

దళారులకు అమ్మి నష్టపోవద్దు

వేంసూరు: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యానికి ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించడమే కాక సన్నరకాలకు రూ.500 బోనస్ సైతం ఇస్తోందని జిల్లా సహకార అధికారి(డీసీఓ) గంగాధర్ తెలిపారు. ఈ విషయాన్ని గమనించి రైతులెవరూ దళారులకు విక్రయించి నష్టపోవద్దని సూచించారు. వేంసూరు మండలం కే.జీ.మల్లెల సొసైటీ పరిధి కుంచపర్తిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ధాన్యం తీసుకొచ్చే రైతులు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేయడంతో పాటు ఎప్పటికప్పుడు కాంటా పూర్తికాగానే మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు. సొసైటీ చైర్మన్ కాటే జమలరావు, సీఈఓ చెన్నారెడ్డి, ఏఈఓలు స్వాతి, జమ్ముల కోటిస్వామి, కిన్నెర వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అడుగడుగునా కల్తీ..



ఖమ్మం రిక్కాబజార్‌లో సీజ్ చేసిన అల్లం, వెల్లుల్లి పేస్ట్‌తో అధికారులు

ఆహార పదార్థాలు కలుషితం

- పుట్టగొడుగుల్లా కుటీర పరిశ్రమల ఏర్పాటు
- నాణ్యత, అనుమతులు లేకుండానే నిర్వహణ
- అయినా పట్టింపులేని ఫుడ్ సేఫ్టీ అధికారులు
- టాస్క్‌ఫోర్స్ తనిఖీల్లో బయటపడుతున్న లోపాలు

ఫుడ్ సేఫ్టీ అధికారులు ఎక్కడ?

జిల్లాలో ఫుడ్‌సేఫ్టీ అధికారుల తీరు విమర్శలకు తావిస్తోంది. జిల్లావ్యాప్తంగా పలు కుటీర పరిశ్రమలు, హోటళ్లు ఉన్నా తనిఖీల మాటెత్తడం లేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప తనిఖీ చేయకపోవడం, ఆపై తూతూ మంత్రంగా చర్యలు తీసుకుంటుండడం అక్రమార్కులకు కలిసొస్తోంది. ఆహార తయారీ, ప్రాసెసింగ్, పంపిణీ, అమ్మకం, దిగుమతిని నియంత్రించడం, పర్యవేక్షించడం తద్వారా సురక్షితమైన, ఆరోగ్యకరమైన ఆహారాన్ని నిర్ధారించడం ఫుడ్ అథారిటీ విధి. అయితే ఆ విధులేమీ అధికారులకు పట్టడం లేదనే విమర్శలు ఉన్నాయి.

టాస్క్‌ఫోర్స్ అధికారులు వస్తేనే...

ఖమ్మం నగరంతోపాటు మధిర, సత్తుపల్లి, వైరా ప్రాంతాల్లో కూడా కల్తీ దందా కొనసాగుతున్నట్లు సమాచారం. హైదరాబాద్ నుంచి టాస్క్‌ఫోర్స్ అధికారులు వచ్చి దాడులు చేసినప్పుడు ఈ దందా కొన్నాళ్లు ఆగుతున్నా, మళ్లీ తర్వాత మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. గతంలోనూ టాస్క్‌ఫోర్స్ బృందాలు జిల్లాలోని రెస్టారెంట్లు, హోటళ్లపై దాడులు చేసి కల్తీ జరిగినట్లు నిర్ధారించి ఆహార పదార్థాలను సీజ్ చేశారు. సోమవారం ఖమ్మం రిక్కాబజార్‌లోని ఓ ఇంట్లో దుర్వాసన వస్తున్న అల్లం పేస్ట్‌ను భారీగా స్వాధీనం చేసుకున్నారు. చర్చి కాంపౌండ్‌లోని ఓ పిండివంటల తయారీ పరిశ్రమలో వినియోగించిన పదార్థాల్లో కేన్సర్ కారకాలు ఉన్నాయని గుర్తించారు. మయూరిసెంటర్‌లోని ఓ స్వీట్ షాపు ఖార్కానా అపరిశుభ్రంగా ఉన్నట్లు తేల్చారు. అయితే, జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారులు తరచుగా తనిఖీలు నిర్వహిస్తే తప్ప కల్తీ దందాకు అడ్డుకట్ట పడే అవకాశం లేదనే చెప్పాలి.

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: జిల్లాలోని హోటళ్లు, బేకరీల్లో ఏది తింటే ఏమవుతుందో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. ఎందులో ఏం కల్తీ జరిగిందో తెలియక ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. చాలాచోట్ల నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ నాసిరకం, కాలం చెల్లిన ఆహార పదార్థాలు విక్రయిస్తున్నా దీన్ని అరికట్టాల్సిన ఫుడ్‌సేఫ్టీ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండడం గమనార్హం. ఇదే అదునుగా కల్తీరాయుళ్లు ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు. జిల్లా కేంద్రంతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ కుటీర పరిశ్రమలు పుట్టగొడుగుల్లా ఏర్పాటుకాగా.. ఎలాంటి అనుమతి తీసుకోకుండా నాసిరకం ముడిసరుకులు వినియోగించి ఆహార పదార్థాలను తయారు చేస్తున్నారు. అప్పుడప్పుడు హైదరాబాద్ నుంచి వచ్చే టాస్క్‌ఫోర్స్ బృందాలు తనిఖీలు చేపట్టినప్పుడు ఈ వ్యవహారం బయటపడుతుండగా మిగతా సమయాల్లో దందా షరా'మామూలే' అన్నట్లు కొనసాగుతోంది.

వీధికో కుటీర పరిశ్రమ

ఆహార పదార్థాలను తయారు చేసే కుటీర పరిశ్రమలు వీధికొకటి చొప్పున వెలుస్తున్నాయి. ఈ పరిశ్రమల ఏర్పాటు సమయాన ప్రభుత్వం విధించిన నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. తరచుగా ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీ చేయాలి. కానీ నిబంధనలు పాటించకుండా, ఎవరి అనుమతి తీసుకోకుండా పలువురు పసుపు, కారం పొడులు, అల్లం పేస్ట్‌ కాక నూనెలు, మసాలా పౌడర్లు, నూడుల్స్, చిప్స్ తయారుచేస్తున్నారు. ఈక్రమాన నాసిరకం ముడిసరుకులు వినియోగిస్తున్నా అధికా రులు చర్యలు మాత్రం తీసుకోవడం లేదు.

పట్టుబడినా ఆగని దందా

పలుమార్లు ఆహార పదార్థాల తయారీదారులు పట్టుబడినా మళ్లీ దందా కొనసాగిస్తుండడం గమనార్హం. నగరంలో పలుచోట్ల నాసిరకం, నాణ్యత లేని ఆహార పదార్థాలను నిల్వ చేసిన గోదాంలు, పరిశ్రమలపై టాస్క్‌ఫోర్స్ అధికారులు గతంలో తనిఖీలు చేశారు. ఈక్రమాన పలువురిపై కేసులు నమోదు చేసినా దందాకు బ్రేక్ పడడం లేదు. చిన్న చిన్న కేసులు నమోదు చేయడం, కొద్దిమొత్తంలో జరిమానా విధిస్తుండడంతో వ్యాపారులు వెనుకంజ వేయకపోగా కొత్త వారు ఈ రకమైన వ్యాపారం చేసేందుకు ముందుకొస్తున్నారు.

కొనుగోలుదారుల్లా వచ్చి...

రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీ



ఖమ్మం మయూరిసెంటర్‌లోని ఓ స్వీట్‌షాపులో కాలం చెల్లిన పదార్థాలను పరిశీలిస్తున్న అధికారి

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా కేంద్రంలోని రిక్కాబజార్‌లో అల్లం, వెల్లుల్లి పేస్ట్ తయారుచేస్తున్న కేంద్రంలో పాడైన పదార్థాలు వాడుతున్నారని అధికారులకు ఫిర్యాదు అందింది. అయితే, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం ఉండదని అనుకున్నారో ఏమో కానీ సదరు వ్యక్తులు ఏకంగా రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ బృందం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆర్.వీ.కర్ణన్ ఆదేశాలతో సోమవారం ఇక్కడకు వచ్చిన ఓ బృందం తనిఖీలు చేపట్టగా వారికి అందిన ఫిర్యాదు నిజమేనని తేలింది.


కార్ఖానాలో కేన్సర్ కారకాలు

ఖమ్మం చర్చి కాంపౌండ్‌లోని విజయలక్ష్మి పిండి వంటల కార్ఖానాలో పరిశీలించగా పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. అలాగే, కేన్సర్ కారకాలైన రసాయన రంగులను అధిక మోతాదులో స్వీట్ల తయారీకి వినియోగిస్తున్నట్లు గుర్తించారు. దీంతో రూ.6,550 విలువైన పిండి వంటలు, పచ్చళ్లను అక్కడికక్కడే ధ్వంసం చేసి శాంపిళ్లను పరీక్షలకు పంపించారు. ఇక మయూరిసెంటర్‌లోని స్వీట్ హోమ్‌లో తనిఖీ చేయగా పూర్తిగా అపరిశుభ్ర వాతావరణంలో తయారు చేయడమే కాక అధిక మోతాదులో రసాయన రంగులను వాడినట్లు తేలింది. ఈమేరకు సుమారు రూ.6,950 విలువైన ఆహార పదార్థాలను ధ్వంసం చేసి నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. ఆహార పదార్థాల తయారీలో నిబంధనలు పాటించకున్నా, అనుమతి తీసుకోకున్నా వ్యాపారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని రాష్ట్ర టాస్క్ ఫోర్స్ టీం హెడ్ వి.జ్యోతిర్మయి తెలిపారు.

మూత తీస్తే దుర్వాసన

రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ టీం హెడ్, జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వి.జ్యోతిర్మయి ఆధ్వర్యాన టాస్క్‌ఫోర్స్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు రోహిత్‌రెడ్డి, పి.స్వాతి, పి.మనోజ్ కుమార్, బి.రతన్‌రావుతో కూడిన బృందం తనిఖీలు చేపట్టింది. కొనుగోలుదారుల మాదిరి అల్లం, వెల్లుల్లి పేస్ట్ తయారీ కేంద్రానికి వారు వెళ్లారు. అక్కడ వివరాలు ఆరా తీస్తూ కొంత మోతాదులతో తమకు పేస్ట్ కావాలని చెబుతూనే నాణ్యతను పరిశీలించగా దుర్వాసన వచ్చింది. అంతేకాక బాటిళ్లపై లేబుళ్లు ఉన్నా వాటిపై బ్యాచ్ నంబర్, తయారీ తేదీ, గడువు ఇతర వివరాలేమీ ముద్రించలేదు. అంతేకాక ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ లేకుండానే తయారు చేస్తున్నట్లు గుర్తించారు. దీంతో నకిలీ పేస్ట్‌గా అనుమానంతో నమూనాలు సేకరించి రూ.1.32 లక్షల విలువైన 960 కేజీల అల్లం, వెల్లుల్లి మిశ్రమాన్ని సీజ్ చేశారు.

ఒకే జోన్‌లోకి సాగర్ ఆయకట్టు



సాగర్ ప్రధాన కాల్వ (ఫైల్)

- జోన్–3 ఆయకట్టు కూడా జోన్–2లోకి మార్పు
- వైరా నదిపై వంగవీడు వద్ద రూ.650 కోట్లతో 'లిఫ్ట్'
- ఒకటి, రెండో రోజుల్లో ఉత్తర్వులు

ఖమ్మంఅర్బన్: జిల్లాలోని సాగర్ ఆయకట్టు మొత్తాన్ని ఒకే జోన్ పరిధిలోకి తీసుకొచ్చేందుకు రంగం సిద్ధమైంది. జోన్–3లో ఉన్న ఆయకట్టుకు సైతం జోన్–2 ద్వారా సాగునీరు అందించేలా అధికారులు ప్రతిపాదనలను సిద్ధం చేశారు. ఇందుకోసం రూ.650 కోట్ల అంచనా వ్యయంతో వైరా నదిపై మధిర మండలం వంగవీడు వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని నిర్మిస్తారు. ఈ మేరకు ఒకటి, రెండు రోజుల్లో ప్రభుత్వం నుంచి మంజూరు ఉత్తర్వులు వెలువడనున్నట్లు తెలిసింది.

17మండలాల్లో ఆయకట్టు

నాగార్జునసాగర్ ప్రాజెక్టు కింద జిల్లాలోని 17 మండలాల్లో భూములు సాగవుతున్నాయి. ప్రాజెక్టు నిర్మాణ సమయంలో అప్పటి పరిస్థితులకు అనుగుణంగా జిల్లా ఆయకట్టును మూడు జోన్లుగా విభజించారు. అయితే, మూడో జోన్ పరిధికి సంబంధించి ఏపీలో సుమారు 30 కి.మీ. ప్రవాహం తర్వాత తెలంగాణ ఆయకట్టుకు నీరు అందుతోంది. అప్పటి లెక్కల ప్రకారం మధిర, ఎర్రుపాలెం మండలాల పరిధిలో సుమారు 18 వేల ఎకరాల భూమి ఉంది. అయితే, ఇదంతా కాల్వల చివరన ఉండడంతో ఏటా ఇక్కట్లు ఎదురవుతున్నాయి. సాగు చేసిన పైర్లు చేతికందే దశలో ఎండిపోవడం, నీటి కోసం రైతులు ఆందోళన చేయడం పరిపాటిగా మారుతోంది. ఇక రాష్ట్ర విభజన తర్వాత సమస్య మరింత జటిలంగా మారింది.

వారు వాడుకున్నాకే...

జోన్–3లో ఏపీ ప్రాంత ఆయకట్టుకు నీరు విడుదల చేసుకున్నాకే కిందకు వదులుతుండడంతో ఎర్రుపాలెం, మధిర ప్రాంత రైతులు ఇబ్బంది పడుతున్నారు. తెలంగాణ ఏర్పడ్డాక ఈ సమస్య ఎక్కువవడంతో రైతులు తమ ఆయకట్టును కూడా జోన్–2 పరిధిలోకి తీసుకురావాలని కోరుతున్నారు. ఇంతలోనే కాంగ్రెస్ అధికారంలోకి రావడం, మధిర నుంచి గెలిచిన భట్టి విక్రమార్కకు డిప్యూటీ సీఎం పదవి దక్కడంతో ఈ అంశంపై దృష్టి సారించారు. ఆయకట్టు జోన్ బదలాయింపు కోసం భారీ లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణానికి కసరత్తు చేశారు. సుమారు రూ.650 కోట్లకు పైగా అంచనాలతో వైరా నదిపై మధిర మండలం వంగవీడు వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మిస్తే.. సాగర్ నీటిని వైరా నదిలోకి చేర్చి అక్కడి నుంచి ఎత్తిపోతల ద్వారా ఆయకట్టుకు తరలించేలా ప్రణాళిక రూపొందించారు. ఫలితంగా జోన్–3 లోని ఆయకట్టుతో పాటు ఎర్రుపాలెం, మధిర మండలాల్లో ఇంకొన్ని భూములు కలిపి సుమారు 33వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందని చెబుతున్నారు. ఇప్పటికే ప్రతిపాదనలకు అనుమతి లభించడంతో త్వరలోనే ఉత్తర్వులు జారీ అవుతాయని తెలుస్తోంది.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

ఎంపీ రఘురాంరెడ్డి



వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మంవన్‌టౌన్: ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకుంటానని ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి తెలిపారు. ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఆయన పలువురి నుంచి వినతిపత్రాలు, దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించేలా కృషి చేస్తానని చెప్పారు. అలాగే, నియోజకవర్గ అభివృద్ధికి కేంద్రప్రభుత్వం నుండి వీలైనంత మేర నిధులు తీసుకొస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు కొప్పుల చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

నేను డ్రైవరన్నను..!

చిన్నారిని లాలించిన ఆర్టీసీ డ్రైవర్ మల్లయ్య



ఒడిలో చంటిబిడ్డతో ఆర్టీసీ డ్రైవర్ మల్లయ్య

ఖమ్మంమయూరిసెంటర్: మహాలక్ష్మి పథకం అమలుతో పలు సమయాల్లో రద్దీ దృష్ట్యా ఆర్టీసీ బస్సుల డ్రైవర్లు కొందరు నిర్దేశిత ప్రాంతాల్లో ఆపడం లేదని, నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని అక్కడక్కడా ఫిర్యాదులు వస్తున్నాయి. కానీ ఈ డ్రైవర్ మాత్రం అత్యవసర పరిస్థితుల్లో మహిళా ప్రయాణికురాలి బిడ్డను లాలించి అభిమానం చూరగొన్నాడు. అంతేకాక అధికారుల నుంచి సన్మానం అందుకున్నాడు. వివరాలు.. ఇటీవల మణుగూరు నుండి హైదరాబాద్‌కు చంటి బిడ్డతో ఓ మహిళ బస్సులో వెళ్తోంది. ఆమె మార్గ మధ్యలోని ఓ బస్టాండ్‌లో వ్యక్తిగత అవసరాలపై దిగాల్సి రాగా వెంట ఎవరూ లేకపోవడంతో బిడ్డను ఎవరికి అప్పగించాలో తెలియక సందిగ్ధత ఎదుర్కొంది. చివరకు బస్సు డ్రైవర్ పి.మల్లయ్యను ఆశ్రయించగా ఆయన చంటి బిడ్డను ఎత్తుకుని ఆమె వెళ్లి వచ్చే వరకు లాలించాడు. ఈ విషయం తెలియడంతో ఆర్టీసీ ఆర్‌ఎం ఏ.సరిరామ్ సోమవారం మల్ల య్యను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్‌లు భవాని ప్రసాద్, జీఎస్ పవిత్ర, పర్సనల్ ఆఫీసర్ ఎ.నారాయణ పాల్గొన్నారు.

గోదారమ్మకు పుణ్యనదీ హారతి



గోదావరికి హారతులు సమర్పిస్తున్న అర్చకులు

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యాన సోమవారం నిర్వహించిన పుణ్య నదీ హారతి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గోదావరి తీరం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. రామాలయానికి అనుబంధంగా ఉన్న శ్రీ అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామివారి దేవాలయంలో కార్తీక సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గోదారమ్మకు నదీ హారతి సమర్పించారు. కార్తీక మాసంలో శివుడికి ఎంతో ఇష్టమైన సోమవారం రోజున భక్తులు, వేదపండితులు హారతులతో నదీమతల్లికి నీరాజనం పలికారు. మేళతాళాలతో ఆలయం నుంచి బయలుదేరిన భక్తుల జై శ్రీరామ్, ఓం నమః శివాయ నామస్మరణలతో గౌతమీ తీరం పులకించింది. అర్చకుల ప్రత్యేక పూజల అనంతరం ఆలయ ఈఓ రమాదేవి దంపతులు గోదావరికి పసుపు, కుంకుమ, వస్త్రాలు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పుణ్య నదీ హారతి కార్యక్రమాన్ని తిలకించారు.

రామయ్యకు ముత్తంగి అలంకరణ

భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి ముత్తంగి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు నిర్వహించారు.

సీతారామ 13వ ప్యాకేజీ టెండర్ల గడువు పొడిగింపు

ఖమ్మంఅర్బన్: సీతారామ ప్రాజెక్ట్ ద్వారా గోదావరి జలాలను పాలేరు రిజర్వాయర్‌కు కలిపే లింక్ కెనాల్ పనులకు ఇటీవల జలవనరుల శాఖ అధికారులు టెండర్లు ఆహ్వానించారు. ఈమేరకు గడువు 16వ తేదీతో ముగియగా 25వరకు పొడిగించినట్లు అధికారులు తెలిపారు. సుమారు రూ.191 కోట్ల అంచనాలతో చేపట్టే ఈ పనులకు గత నెల 25న ఆన్‌లైన్‌లో టెండర్లు ఆహ్వానించగా ఈనెల 8వ తేదీ వరకే తొలుత గడువు విధించారు. ఆతర్వాత 16వ తేదీకి, ఇప్పుడు 25వ తేదీ వరకు పొడిగించడం గమనార్హం. జిల్లా జలవనరుల శాఖ ఎస్‌ఈ పర్యవేక్షణలో టెండర్లు నిర్వహించాల్సి ఉండగా, ఖమ్మం ఎస్‌ఈ గత నెలాఖరున ఉద్యోగ విరమణ చేయడంతో కొత్త వారి నియామకంలో జాప్యం జరిగింది. తాజాగా పాలేరు ఈఈ వెంకటేశ్వర్లుకు ఎస్‌ఈగా అదనపు బాధ్యతలు అప్పగించడంతో టెండరు గడువు పొడిగించారు.

రంగంలోకి జిల్లా బాస్‌లు..

- ధాన్యం, పత్తి కొనుగోళ్లపై దృష్టి
- పలు ప్రాంతాల్లోని కొనుగోలు కేంద్రాల తనిఖీ



కూసుమంచి : పాలేరులో ధాన్యం కొనుగోలు రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



ముదిగొండ : న్యూలక్ష్మీపురం మిల్లు వద్ద పత్తిలో తేమ శాతాన్ని పరీక్షిస్తున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మం రూరల్/కూసుమంచి: ధాన్యం, పత్తి కొనుగోళ్లపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. తేమ, తాలు పేరిట వ్యాపారులు కొర్రీలు పెడుతున్నారని, పత్తి తేమ శాతం నిర్ధారించకుండానే వ్యాపారులు ధర నిర్ణయిస్తున్నారనే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాక సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ ప్రకటిస్తుండడంతో అవకతవకలు జరగకుండా పర్యవేక్షించాలని ప్రభుత్వం సూచిస్తోంది. దీంతో మునుపెన్నడూ లేని విధంగా డివిజన్, మండల స్థాయి అధికారులతో తనిఖీలు చేయిస్తూనే ఏకంగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీసు కమిషనర్ సునీల్‌దత్ రంగంలోకి దిగారు.

తేమ పరీక్షించుకున్నాకే రావాలి

సీసీఐ కేంద్రాలు ఏర్పాటైన జిన్నింగ్ మిల్లులకు రైతులు తీసుకొచ్చే పత్తిని పరీక్షించి నాణ్యత ఆధారంగా మద్దతు ధరతో కొనుగోలు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. ఖమ్మం రూరల్ మండలం పొన్నేకల్‌లోని జిన్నింగ్ మిల్లును అసిస్టెంట్ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్టతో కలిసి ఆయన సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి పత్తి సాగు, దిగుబడి, తేమ శాతం, అందిన ధరపై ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ 8 నుంచి 12శాతం తేమ ఉన్న పత్తికే మద్దతు ధర వస్తుందని, ముందుగానే పరీక్షించకుండా తీసుకొస్తే రవాణా ఖర్చులు నష్టపోతారని తెలిపారు. ఈ మేరకు పొలాల వద్దే తేమ శాతం చేయించుకోవాలని సూచించారు. ఆతర్వాత కూసుమంచి మండలం పాలేరులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, అసిస్టెంట్ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్టతో కలిసి పరిశీలించిన కలెక్టర్ ధాన్యం నాణ్యతపై ఆరాతీశారు. కేంద్రాలకు ఎప్పుడు వచ్చారు, నిర్వాహకులు టార్పాలిన్ కవర్లు ఇచ్చారా, లేదా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, నాణ్యమైన గన్నీబ్యాగ్‌లను సమకూర్చి కాంటా కాగానే మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో మార్కెట్ చైర్మన్ బి.హరినాథ్‌బాబు, ఉద్యోగులు హిమబిందు, ఉమానగేష్, కొత్త జ్యోతి, సత్యవర్ధన్ రాజ్, రామడుగు వాణి పాల్గొన్నారు.

ముదిగొండ/నేలకొండపల్లి: రైతులకు ఇబ్బంది ఎదురుకాకుండా పంట ఉత్పత్తులు కొనుగోలు చేయాలని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ ఆదేశించారు. ముదిగొండ మండలం న్యూలక్ష్మీపురంలోని జిన్నింగ్ మిల్లులోని సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని సీపీ పరిశీలించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా, తేమ శాతం ఆధారంగా ధర నిర్ణయిస్తున్నారా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. అలాగే, నేలకొండపల్లిలోని మార్కెట్ కార్యాలయానికి వెళ్లిన సీపీ.. మార్కెట్ చైర్మన్ వి.సీతారాములు, ఉద్యోగులతో సమావేశమై పలు అంశాలపై సమీక్షించారు. రాజేశ్వరపురంలోని అరుణాచలం రైస్ మిల్లు వద్ద రైతుల ఆందోళన వివరాలు ఆరాతీశారు. మంగాపురంతండాకు చెందిన ఓ రైతు పంట నష్టపరిహారం అందలేదని తెలపగా ఏఓ రాధకు సూచనలు చేశారు. అనంతరం సింగారెడ్డిపాలెంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను సందర్శించిన సీపీ విద్యార్థినుల భద్రత విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ముదిగొండ, కూసుమంచి సీఐలు ఓ.మురళి, సంజీవ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక



జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో పీఈటీలు

ఏన్కూరు: రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఉమ్మడి జిల్లా సాఫ్ట్‌బాల్ బాలుర జట్టును సోమవారం ఎంపిక చేశారు. ఏన్కూరు మండలం తూతకలింగన్నపేటలోని గుడ్‌న్యూస్ పాఠశాలలో జరిగిన ఎంపిక పోటీలకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 70 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరిలో ప్రతిభ కనబర్చిన వారితో ఎంపిక చేసిన జట్టు ఈనెల 24, 25వ తేదీల్లో మెదక్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముక్తి వెంకటేశ్వర్లు, ఓం ఆదిత్య, గాయత్రి, ప్రిన్సిపాల్ దాసరి రమేష్, పీఈటీ టి.శోభన్, పీడీ రమేష్ పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో ట్రోఫీ



ట్రోఫీ అందుకుంటున్న జిల్లా బాలుర జట్టు

ఖమ్మం స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి అండర్–14 పాఠశాలల క్రీడల్లో భాగంగా మెదక్‌లో నిర్వహించిన వాలీబాల్ టోర్నీలో ఖమ్మం జిల్లా బాలుర జట్టు టైటిల్ దక్కించుకుంది. తొలుత పూల్ విభాగంలో హైదరాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి జట్లపై వరుస విజయాలు సాధించి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరింది. అందులోనే కాక సెమీఫైనల్స్‌లో వరంగల్ జట్టుపై, ఫైనల్స్‌లో రంగారెడ్డి జట్టుపై విజయం సాధించిన జిల్లా జట్టు ట్రోఫీ గెలుచుకుంది. అంతేకాక రాష్ట్ర స్థాయి వాలీబాల్ బాలుర జట్టుకు జిల్లా నుంచి రిషి, నవదీప్, సన్నీ, రాజు, బాలికల జట్టులో సయ్యద్ అర్షియా ఎంపికైంది. ఈసందర్భంగా క్రీడాకారులను డీఈఓ సోమశేఖరశర్మ, జిల్లా పాఠశాలల క్రీడల కార్యదర్శి కె.నర్సింహామూర్తి, పీడీలు షఫీక్ అహ్మద్, సైదేశ్వరరావు, కోచ్ ఎం.డీ.అక్బర్ అలీ అభినందించారు.

బిల్లులు మంజూరు చేయాలి



సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న నాయకులు

ఖమ్మం సహకారనగర్: ఉద్యోగ, ఉపాధ్యాయుల, పెన్షనర్ల మెడికల్ బిల్లుల మంజూరులో జాప్యాన్ని నివారించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీ.వీ.నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు సోమవారం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. పారదర్శకత పాటిస్తూ వరుస క్రమాన బిల్లులు మంజూరు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు బుర్రి వెంకన్న, షేక్. ఉద్దండ్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

27, 28వ తేదీల్లో సీపీఎం జిల్లా కమిటీ సమావేశాలు

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఎం జిల్లా మహాసభలు సత్తుపల్లిలో జరగనున్న నేపథ్యాన ఈనెల 27, 28వ తేదీల్లో జిల్లా కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశాలకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, పి.సుదర్శన్‌రావు తదితరులు హాజరవుతారని వెల్లడించారు. ఇప్పటికే శాఖ, మండల మహాసభలు నిర్వహించగా డివిజన్ మహాసభలు డిసెంబర్ నెల మొదటి వారంలో జరుగుతాయని, ఆపై జిల్లా మహాసభలను డిసెంబర్ 18, 19వ తేదీల్లో సత్తుపల్లిలో నిర్వహించనున్నామని తెలిపారు. జిల్లా కమిటీ సమావేశంతో పాటు మహాసభలను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని ఆయన ఓ ప్రకటనలో కోరారు.

మైక్రో ఫైనాన్స్ కార్యాలయం వద్ద నిరసన

మధిర: మైక్రో ఫైనాన్స్ సంస్థ ఏజెంట్ వేధింపులతోనే తన తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపిస్తూ ఓ మహిళ మధిర పాత వాసవీ థియేటర్ సమీపాన సంస్థ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలిపింది. ఈసందర్భంగా మండలంలోని రాయపట్నంకు చెందిన కేతినేని రాజేశ్వరి తెలిపిన వివరాలు... రాయపట్నంకు చెందిన గుగ్గిళ్లపు వెంకటేశ్వర్లును మైక్రో ఫైనాన్స్ సంస్థ ఏజెంట్ సంప్రదించి ఇంటి నిర్మాణానికి రుణం ఇప్పిస్తానని చెప్పగా తన తండ్రి ఆరోగ్యం బాగా లేదని నిరాకరించినట్లు తెలిపారు. అయితే, ఏదైనా ప్రమాదం సంభవిస్తే మరణానంతరం కిస్తీలు చెల్లించాల్సిన అవసరముండదని నమ్మించిన ఏజెంట్ రిజిస్ట్రేషన్ ఫీజు, ప్రాసెసింగ్ ఫీజు, ఇన్సూరెన్స్ పేరుతో నగదు వసూలు చేశాడని వెల్లడించింది. తన తండ్రి ఆరోగ్యం బాగాలేక కిస్తీలు చెల్లించడంలో ఆలస్యమైతే ఒత్తిడి చేయగా కొన్నాళ్ల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపింది. ఇప్పుడు తన తండ్రికి బీమా లేదని చెప్పడమేకాక కిస్తీలు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారని వాపోయింది. ఒంటరి మహిళనైన తనను ఇబ్బంది పెడుతున్న ఫైనాన్స్ కంపెనీ బాధ్యులు, ఏజెంట్‌పై చర్యలు తీసుకోవాలని రాజేశ్వరి కోరింది. కాగా, ఆమెకు సీపీఎం నాయకులు మందా సైదులు, పాపినేని రామ నరసయ్య తదితరులు మద్దతు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

గ్రీవెన్స్ డేలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం సహకారనగర్: ప్రజావాణిలో ప్రజలు అందించే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణిలో భాగంగా ఆయన అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డితో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమావేశమైన కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ ఫిర్యాదును పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఈకార్యక్రమంలో డీఆర్వో రాజేశ్వరి, డీఆర్‌డీఓ సన్యాసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో...

కలెక్టరేట్‌లోని కాల్ సెంటర్‌కు వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. కలెక్టరేట్‌లోని కాల్ సెంటర్‌ను తనిఖీ చేసిన ఆయన మాట్లాడారు. ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే, ధాన్యం, పత్తి కొనుగోళ్లపై ఫిర్యాదు చేసేలా టోల్ ఫ్రీ నంబర్ 1077ను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఈ నంబర్‌కు ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి అదనపు కలెక్టర్‌కు సమర్పించాలని సూచించారు. అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, అసిస్టెంట్ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ, కాల్ సెంటర్ ఇన్‌చార్జ్ రజిత తదితరులు పాల్గొన్నారు.

పత్తి ధరపై రైతుల ఆందోళన

- వ్యాపారుల తీరుపై గోడు వెళ్లబోసుకున్న పలువురు
- ఖమ్మం మార్కెట్‌ను సందర్శించిన సీసీఐ అధికారులు



ధరల్లో తేడాను అధికారులకు వివరిస్తున్న రైతులు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పత్తికి మద్దతు దక్కకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారులు తేమ శాతాన్ని కనీస పరీక్షించడం లేదని, తద్వారా తాము నష్టపోతున్నామని మండిపడ్డారు. పత్తి నాణ్యత ప్రమాణాల పరిశీలనకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) వరంగల్ బ్రాంచ్ అధికారులు సోమవారం మార్కెట్‌కు వచ్చారు. ఈ సందర్భంగా అధికారులు పత్తి నాణ్యతను పరిశీలిస్తుండగా రైతులు చుట్టుముట్టి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలు, వాతావరణ పరిస్థితులతో పత్తిలో తేమ ఉండగా.. 8–12 శాతం తేమ ఉంటేనే కొనుగోలు చేస్తామని నిబంధన విధించడం సరికాదన్నారు. తేమ తేమ శాతం పేరిట వ్యాపారులు క్వింటాకు మద్దతు ధర కన్నా రూ.వెయ్యి నుంచి రూ.1500 తక్కువకే కొనుగోలు చేస్తున్నారని వాపోయారు. అలాగే, మిల్లుల్లో కాకుండా ఖమ్మం మార్కెట్‌లోనూ సీసీఐ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

మార్కెట్‌లో ఫ్లెక్సీలు

జిల్లాలో ఎక్కడెక్కడ సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు చేపడుతున్నారో వివరించేలా వ్యవసాయ ఖమ్మం మార్కెట్‌లో ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. పత్తిలో తేమ శాతం, అందుకు అనుగుణంగా చెల్లించే ధరను అందులో పొందుపర్చారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు జిల్లా నలుమూలల నుంచే కాక మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాలతో పాటు ఏపీలోని కృష్ణా, గుంటూరు జిల్లాల రైతులు కూడా పత్తి తీసుకొస్తున్నారు. అయితే, ఇక్కడి వ్యాపారులు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే తక్కువ చెల్లిస్తున్నారనే ఆరోపణలు వస్తుండడంతో సీసీఐ కేంద్రాలకు వెళ్లేలా ఫ్లెక్సీలు ఏర్పాటుచేసినట్లు తెలిసింది.

తగిన తేమశాతం ఉంటేనే కొనుగోళ్లు

పత్తిని ఆరబెట్టుకొని 8–12 శాతం ఉండేలా తీసుకొస్తేనే కొనుగోలు చేస్తామని సీసీఐ వరంగల్ బ్రాంచ్ మేనేజర్ అర్జున్ దబే స్పష్టం చేశారు. రైతులు తమ సమస్యలు వివరించాక ఆయన మాట్లాడారు. సీసీఐ కొనుగోళ్లలో తేమ నిర్ధారించాకే కొనుగోళ్లు ఉంటాయని, ఆపై కాంటాలో కోత విధించే సమస్య ఎదురుకాదని తెలిపారు. లూజ్ పత్తిని రైతులు నేరుగా సీసీఐ కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎం ఏ.అలీం, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

డీఈఓ సోమశేఖరశర్మ



రామకృష్ణాపురం పాఠశాలలో వివరాలు ఆరాతీస్తున్న డీఈఓ శర్మ

చింతకాని: విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ ఉపాధ్యాయులకు సూచించారు. చింతకాని మండలం రామకృష్ణాపురం, పందిళ్లపల్లి ఉన్నత పాఠశాలలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రగతిని పరీక్షించడమే కాక మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా, లేదా అని ఆరా తీశారు. అనంతరం పాఠ్యాంశాల బోధన, వచ్చేనెలలో జరగనున్న నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే(ఎన్‌ఏఎస్) పరీక్షకు సన్నద్ధతపై ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించేలా శిక్షణ

ఖమ్మంఅర్బన్: జాతీయ స్థాయిలో నిర్వహించనున్న నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే(ఎన్‌ఏఎస్) పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించేలా 3, 6, 9వ తరగతుల విద్యార్థులను సిద్ధం చేయాలని విద్యాశాఖ జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి కె.రవికుమార్ సూచించారు. ఖమ్మం పుట్టకోట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించాక ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 4న ఎన్‌ఏఎస్ పరీక్ష జరగనుండగా విద్యార్థులకు ప్రశ్నపత్రంపై అవగాహన కల్పించి ఉత్తమ ఫలితాలు వచ్చేలా శిక్షణ ఇవ్వాలని హెచ్ఎంలు, ఉపాధ్యాయులకు సూచించారు.

ఐదు ఇసుక ట్రాక్టర్ల సీజ్

తిరుమలాయపాలెం: మండలంలోని పాలేరు, ఆకేరు ప్రాంతాల నుండి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. మండంలోని కాకరవాయి నుండి మూడు, హైదర్‌సాయిపేట ఆకేరు నుండి రెండు ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తుండగా దమ్మాయిగూడెం వద్ద పట్టుకున్నట్లు వెల్లడించారు. ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు బాధ్యులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జమలాపురంలో సామూహిక వ్రతాలు



సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా సోమవారం ప్రత్యేక జరిగాయి. ఆలయ ప్రాంగణంలోని శ్రీసోమేశ్వర స్వామి ఆలయంలో మహిళలు దీపాలను వెలిగించారు. అలాగే, యాగశాలలో సామూహిక శ్రీ సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించగా పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ఈఓ కె.జగన్ మోహన్‌రావు, వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస్‌శర్మ, సీనియర్ అసిస్టెంట్ కె.విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణకు మొరాయించిన మిల్లర్లు

ఆర్‌డీఓ చొరవతో దిగుమతి



కొనుగోలు కేంద్రంలో మాట్లాడుతున్న ఆర్‌డీఓ రాజేందర్

పెనుబల్లి: ఐకేపీ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన కేంద్రంలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని దిగుమతి చేసుకోవడానికి మిల్లర్లు సహకరించకపోవడంతో ఆర్‌డీఓ రంగంలోకి దిగాల్సి వచ్చింది. పెనుబల్లి మండలం మండాలపాడులో ఐకేపీ ద్వారా ధాన్యం కొనుగోళ్లు చేపట్టారు. అయితే, ఈ ధాన్యాన్ని దిగుమతి చేసుకోవడానికి మిల్లర్లు కొర్రీ పెడుతుండడంతో కల్లూరు ఆర్‌డీఓ ఎల్.రాజేందర్ గౌడ్ సోమవారం మిల్లర్లతో చర్చించారు. దీంతో 252 క్వింటాళ్ల ధాన్యాన్ని రైస్ మిల్లుకు తరలించారు. అలాగే గన్నీ సంచుల సమస్య ఉండడంతో మాట్లాడి మరో 250 క్వింటాళ్ల ధాన్యాన్ని కాంటా వేయించారు. కాగా, కాంటా పూర్తయిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని, ఈ విషయంలో ఎవరు నిర్లక్ష్యంగా వ్యవహరించినా చర్యలు తప్పవని ఆర్‌డీఓ హెచ్చరించారు. తహసీల్దార్ గంటా ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల బంద్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలను మంగళవారం నుంచి నిరవధికంగా బంద్ చేయనున్నారు. ఈ మేరకు ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ బాధ్యులు సోమవారం హనుమకొండలో కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రతాప్‌రెడ్డికి నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ బాధ్యులు మాట్లాడుతూ రెండేళ్ల నుంచి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని పేర్కొన్నారు. మంత్రులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోగా ముఖ్యమంత్రిని కలిసే సమయం ఇవ్వలేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక అధ్యాపకులు, సిబ్బందికి వేతనాలు ఇవ్వలేకపోతున్నామని చెప్పారు. అయినా డిగ్రీ, పీజీ విద్యార్థులు నష్టపోవద్దనే కారణంతో తరగతులు నిర్వహించామని, గతంలో ఓసారి కళాశాలలను బంద్ చేయగావిద్యాశాఖ సెక్రటరీ బుర్రా వెంకటేశం తమను పిలిచి మాట్లాడి వారంలో విడుదల చేస్తామని చెప్పినా నేటికీ చెల్లించలేదన్నారు. దీంతో మంగళవారం నుంచి కళాశాలల నిరవధిక బంద్‌కు నిర్ణయించామని, ఈనెల 26 నుంచి జరిగే డిగ్రీ పరీక్షలు కూడా బహిష్కరిస్తామని స్పష్టం చేశారు. వీసీకి నోటీసు అందజేసిన వారిలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.రవీంద్రనాథ్, బాధ్యులు జి.వేణుమాధవ్, గోలి వెంకట్, ఎం.శ్రీనివాస్, కృష్ణమోహన్ తదితరులు ఉన్నారు.

కాంటాలో మోసం ఆరోపణలపై మిల్లులో విచారణ



మిల్లు యాజమానులతో మాట్లాడుతున్న సీఐ సంజీవ్

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురం రైస్ మిల్లులో కాంటాలో మోసం జరిగిందని పలువురు రైతులు ఆదివారం ఆందోళనకు దిగారు. ఈ విషయమై 'సాక్షి'లో కథనం ప్రచురితం కావడంతో ఖమ్మం సీపీ సునీల్‌దత్ విచారణకు ఆదేశించారు. దీంతో సోమవారం కూసుమంచి సీఐ సంజీవ్ మిల్లును సందర్శించి కాంటాలు పరిశీలించడంతో పాటు రికార్డులు తనిఖీ చేశారు. మిల్లు యాజమానులతో పాటు రైతులతో మాట్లాడి వివరాలు సేకరించారు. కాంటా వే బిల్లు స్క్రీన్‌పై వచ్చే ఏర్పాట్లు లేకపోవడంతో వెంటనే సరిచేయాలని సూచించారు.

బస్సులు ఆపాలని విద్యార్థుల ఆందోళన



ఎస్‌ఐ రఫీకి వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థులు

ఏన్కూరు: ఆర్టీసీ బస్సులు ఆపాలంటూ ఏన్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సోమవారం తహసీల్ ఎదుట ఆందోళన చేశారు. గ్రీవెన్స్ డే సందర్భంగా ఆందోళన చేయడంతో పాటు తహసీల్దార్, ఎస్‌ఐ రఫీకి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతు ఎమ్మార్వో కార్యాలయం ఎదుట రిక్వెస్ట్ స్టాప్ ఉన్నా బస్సులు ఆపడం లేదని, ఫలితంగా ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. ఇకనైనా ఆర్టీసీ అధికారులు స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు నర్సింహారావు, రామారావు, షాజీద్, మహేష్ పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా ఇవ్వాలి

ఖమ్మంరూరల్: దళిత క్రైస్తవుల ఆర్థిక స్థితిగతుల ను పరిగణనలోకి తీసుకుని ఎస్సీ హోదా ఇవ్వాలని తెలుగు రాష్ట్రాల క్రైస్తవ సమాఖ్య రీజినల్ సెక్రటరీ అశోక్‌కుమార్ కోరారు. ఖమ్మం రూరల్ మండలం నాయుడుపేటలోని చర్చిలో సోమవారం సమాఖ్య ఆధ్వర్యాన పాస్టర్ల సదస్సు జరిగింది. ఈ సమావేశంలో అశోక్‌కుమార్ మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కోసం జస్టిస్ కేజీ.బాలకృష్ణకు వినతిపత్రం ఇవ్వనున్నామని తెలిపారు. సదస్సులో ఖమ్మం బిషప్ నగిలి ప్రకాష్,డైరెక్టర్ పి.సెబాస్టియన్‌తో పాటు ముప్పా ప్రసాద్, తప్పేట శౌరి, కొమ్ము బాబురావు, శేఖర్‌బాబు, వి.సత్యం, పల్లా రాజశేఖర్, బి.జయరాజు, మాదాసు రాజు, కె.ఆంథోని, మాధ్యూ, విజయ్, సుధాకర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో ఒకరు మృతి

ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులాపురం క్రాస్ వద్ద ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొట్టిన ఘటనలో ద్విచక్రవాహనదారుడు ఈర్ల శ్రీనివాసరావు(42) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం సారధినగర్‌కు చెందిన శ్రీనివాసరావు బైక్‌పై ఆటోనగర్‌లో ఉంటున్న తల్లి వద్దకు వెళ్లి తిరిగి వస్తున్నాడు. మార్గమధ్యలో ఏదులాపురం క్రాస్ వద్ద లారీ అతివేగంగా ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీనివాసరావు భార్య మాధవి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ ముష్క రాజు తెలిపారు.

'ఆషా' క్రికెట్ టోర్నీ విజేత 'మణుగూరు'



మణుగూరు జట్టుకు కప్ అందచేస్తున్న విపంచి, విరాజి

సత్తుపల్లి: సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన ఆషా మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌లో మణుగూరు జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్స్‌లో సత్తుపల్లి జట్టుపై విజయం సాధించి మణుగూరు జట్టు ట్రోఫీ కైవసం చేసుకుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, డాక్టర్ దయానంద్ ఆధ్వర్యాన ఈ టోర్నీ నిర్వహించారు. సత్తుపల్లి టీఎస్‌బీ జట్టు, మణుగూరు మజ్జు జట్లు ఫైనల్స్‌లో తలపడగా మజ్జు జట్టు విజేతగా నిలిచింది. ఈమేరకు విజేత జట్టుకు రూ.50వేలు, రన్నరప్ జట్టుకు రూ.30వేల నగదు బహుమతులు, ట్రోఫీలను ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి కుమార్తెలు విపంచి, విరాజి అందించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ టి.కిరణ్, మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్‌బాబుతో పాటు వందనపు సత్యనారాయణ, దొడ్డా శ్రీనివాసరావు, ఎం.డీ.కమల్‌పాషా, మట్టా సుజాత, చింతలపాటి సత్యనారాయణ, చల్లగుళ్ల నర్సింహారావు, మలిరెడ్డి మురళీరెడ్డి, గోలిల శ్రీనివాసరెడ్డి, భరత్, పింగళి సామేలు, సత్యనారాయణరెడ్డి, వంశీ పాల్గొన్నారు.

పెనుబల్లి మండలంలో చోరీలు

పెనుబల్లి: పెనుబల్లి మండలంలోని పలు గ్రామాల్లో రెండు రోజులుగా చోరీలు జరుగుతుండడంతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. మండలంలోని మండాలపాడులో ఐదు ఇళ్లలో, లంకాసాగర్ క్రాస్‌లోని ఓ షాపులో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. అలాగే, శనివారం రాత్రి లింగగూడెంలోని చీకటి రాజా ఇంటి తాళం పగులగొట్టి బంగారు, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. అంతేకాక మండాలపాడులో దోసపాటి లక్ష్మణరావుతో పాటు మరికొందరి ఇళ్లలోనూ చోరీ జరగగా బాధితులు సోమవారం వీఎం.బంజర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆలయంలో చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

రఘునాథపాలెం: ఒక ఆలయంలో చోరీ చేయడంతో పాటు మరో ఆలయంలో దొంగతనానికి యత్నించిన వ్యక్తి సోమవారం పోలీసులకు పట్టుబడ్డాడు. ఈసందర్భంగా రఘునాథపాలెం సీఐ ఉస్మాన్ షరీఫ్ వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. ఎస్‌ఐ ఎన్.శ్రీనివాసరాజు సిబ్బందితో కలిసి మండలంలోని కోయచలక క్రాస్ వద్ద వాహన తనిఖీలు చేపట్టగా ఓ వ్యక్తి బైక్‌పై వెళ్తూ పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించాడు. దీంతో ఆయనను వెంబడించి అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఆయన పాపటపల్లికి చెందిన గోగుల రాజుగా నిర్ధారించగా, పాపటపల్లి ఆలయంలో హుండీ ఎత్తుకెళ్లగా, చిమ్మపూడి ఆలయంలో చోరీకి యత్నించినట్లు వెల్లడించాడు. అంతేకాక చిమ్మపూడి, కామేపల్లి మండలం ముచ్చర్లలో రెండు ద్విచక్ర వాహనాలు చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. దీంతో నాగరాజు నుంచిరెండు బైక్‌లు స్వాధీనం చేసుకుని కోర్టు ఆదేశాలతో రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడిన కారు



వరి పొలాల్లో పల్టీ కొట్టిన కారు

పెనుబల్లి: కారు అదుపు తప్పి పక్కనే వరి పొలాల్లో దూసుకెళ్లి బోల్తా పడగా అందులో ప్రయాణిస్తున్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఖమ్మం నుంచి పెనుబల్లి మండలం లంకాసాగర్‌కు సోమవారం కారులో ఆరుగురు వస్తుండగా టేకులపల్లి వద్ద అదుపుతప్పి పక్కనే ఉన్న వరి పొలాల్లో బోల్తా కొట్టింది. ఈ ఘటనలో ఖమ్మంకు చెందిన కల్యాణి, బిందు, శ్రావణి, కిరణ్‌తో పాటు ఇద్దరు చిన్నారులకు గాయాలు కావడంతో స్థానికులు బయటకు తీసి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

నేలకొండపల్లి: కళాశాల నుంచి వస్తున్న విద్యార్థుల బైక్‌ను మరో వ్యక్తి ఢీకొట్టడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. నేలకొండపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న పైనంపల్లికి చెందిన ఆర్.వెంకటకృష్ణ, షేక్ అబ్దుల్‌మాలిక్ సోమవారం కాలేజీ నుంచి ఇంటికి వెళ్తుండగా, మండల కేంద్రంలోని ఆటో స్టాండ్ వద్ద నేలకొండపల్లికి చెందిన శేఖర్ బైక్‌పై వస్తూ వెనక నుంచి ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఇద్దరు విద్యార్థులతో పాటు శేఖర్‌కు తీవ్రగాయాలు కాగా ప్రథమచికిత్స అనంతరం ఖమ్మం తరలించారు.

కానరాకుండా పోయిన వలస కూలీ



జింకల కృష్ణయ్య

ముదిగొండ: ఖమ్మం– కోదాడ జాతీయ రహదారి పనుల కోసం వచ్చిన వలస కూలీ ఒకరు కానరాకుండా పోవడంతో ఆయన భార్య సోమవారం పోలీసులను ఆశ్రయించింది. వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకులకు చెందిన జింకల కృష్ణయ్య తన భార్యతో కలిసి ఈనెల 8న ముదిగొండ హైవే పనులు చేసేందుకు వచ్చాడు. ఈనెల 12 రాత్రి నుంచి ఆయన కనిపించకుండా పోవడంతో ఎక్కడ వెతికినా ఫలితం లేక కృష్ణయ్య భార్య లక్ష్మి ముదిగొండ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేసింది. కాగా, ఆయన ఆచూకీ తెలిసిన వారు 87126 59181, 87126 59129, 63056 24704 సమాచారం ఇవ్వాలని సీఐ ఓ.మురళి సూచించారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

ఖమ్మంఅర్బన్: ఖమ్మం బల్లేపల్లిలో మహిళ మెడలో గొలుసును గుర్తుతెలియని వ్యక్తి లాక్కెళ్లాడు. బల్లేపల్లికి చెందిన వడ్డెబోయిన మల్లమ్మ తెల్లవారుజామున ఇంటి ముందు వాకిలి ఊడుస్తుండగా బైక్‌పై వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి ఆమె మెడలో గొలుసు లాక్కుని పారిపోయాడు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ పోలీసులు తెలిపారు.

కూలీల వ్యాన్ బోల్తా, పలువురికి గాయాలు

తల్లాడ/కల్లూరు: తల్లాడ మండలంలోని నరసింహారావు పేట భద్రాద్రి కోల్డ్ స్టోరేజ్ ఎదుట సోమవారం కూలీల మినీ వ్యాన్ బోల్తా పడగా పలువురు గాయపడ్డారు. కల్లూరు మండలం కొర్లగూడెంకు చెందిన చెందిన 28మంది మినీ వ్యాన్‌లో పత్తి తీసేందుకు ఏన్కూరు మండలం హిమామ్‌నగర్‌కు వెళ్లి సాయంత్రం తిరిగొస్తున్నారు. నరసింహారావుపేట వద్ద వ్యాన్ అతివేగంగా వెళ్తే క్రమాన కోల్డ్ స్టోరేజ్‌లోకి వెళ్తున్న లారీని తప్పించబోయి అదుపు తప్పి పల్టీ కొట్టింది. ఈఘటనలో కూలీలకు గాయాలయ్యాయి. దీంతో స్థానికులు వ్యాన్‌ను పైకి లేపగా, తీవ్రంగా గాయపడిన లింగపోగు జమలమ్మ, చాట్ల కుమారి, లింగపోగు రాములమ్మ, తడికమళ్ల ఝాన్సీ, మోదుగు కాటమ్మను కల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

రైలుకింద పడి ఏపీ వాసి ఆత్మహత్య

బోనకల్: మండలంలోని మోటమర్రి రైల్వేస్టేషన్ సమీపాన ఓ వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఏపీలోని ఎన్‌టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం విభరింతలపాడుకు చెందిన కొత్త శ్రీనివాసరావు(60) ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకున్నాడని ఖమ్మం జీఆర్‌పీ ఎస్‌ఐ పి.భాస్కర్‌రావు తెలిపారు. మృతదేహాన్ని మధిరకు చెందిన ఆర్‌కే ఫౌండేషన్ చైర్మన్ దోర్నాల రామకృష్ణ సహకారంతో మధిర ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.